
సాక్షి
నల్లగొండ

శనివారం, 19, జూలై, 2025



'బనకచర్ల'పై స్పష్టతనివ్వాలి

బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టతనివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. - 8లో



'దోస్త్' కుదరడం లేదు

దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ఏటా తగ్గుతున్నాయి. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	563.10 అడుగులు
ఇన్‌ఫ్లో	:	67,604 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	7,849 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	5,804 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

సృజనాత్మకత వెలికితీతకే 'ఇన్‌స్పైర్ మనక్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

నల్లగొండ: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత శక్తిని వెలికితీసేందుకే ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఈఓ భిక్షపతి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని డైట్ కళాశాలలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ఆన్‌లైన్ నామినేషన్‌పై సైన్స్ ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాల విద్యార్థుల నుంచి సేకరించిన 5 ప్రాజెక్టులను ఆగస్టు 6లోగా ఇన్‌స్పైర్ యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఇన్‌స్పైర్ అవార్డ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో నవమి ఫౌండేషన్ శ్రవణ్, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, సైన్స్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చేనేత భరోసా' ఇవ్వాలి



మాట్లాడుతున్న గంజి మురళీధర్

నల్లగొండ టౌన్ : జియోట్యాగింగ్ కలిగిన చేనేత కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా చేనేత భరోసా పథకం కింద రుణాలు ఇవ్వాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22, 23, 24 తేదీల్లో అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గంజి నాగరాజు, దండెంపల్లి సత్తయ్య, కందగట్ల గణేష్, జెల్లా నర్సింహ, చెరుకు సైదులు, శ్రీరంగం, వనం గణేష్, ఏలె శ్రీనివాస్, గంజి రాజేష్, రాపోలు వెంకన్న, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ పాయింట్లు, ప్రమోషన్లు వేర్వేరుగా ఉండాలి



నియామక పత్రం అందజేస్తున్న అరుణ్‌కుమార్

నల్లగొండ టౌన్ : రోస్టర్ పాయింట్లు, ప్రమోషన్లు వేర్వేరుగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లపై ఎస్సీ ఉద్యోగులు అందరూ సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మొదట రాష్ట్ర అడహక్ కమిటీని ఏర్పాటు చేసిన తర్వాత జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శంకర్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షులు స్వామి, నందిగామ సైదులు, అసోసియేట్ అధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి కిరణ్, జాయింట్ సెక్రటరీ నీత, ఆర్గనైజింగ్ సెక్రటరీ బెనర్జీ, కోశాధికారి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

22న ఎన్జీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఉపేందర్

రామగిరి(నల్లగొండ): ఈ నెల 22న ఎన్జీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కళాశాలలో విద్యనభ్యసించి అనేకమంది విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడినట్లు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పరిషత్ పోరుకు ఇబ్బందే!

- వేధిస్తోన్న గెజిటెడ్ అధికారుల కొరత
- గతంలో శిక్షణ పొందినవారిలో రిటైరైన కొందరు
- కొత్త వారిని వెతుకుతున్న యంత్రాంగం
- ఉమ్మడి జిల్లాలో అవసరమున్న సిబ్బంది 24,888 మంది
- ప్రస్తుతం ఉన్నది 22,257 మంది మాత్రమే..



నల్లగొండ: జిల్లా పరిషత్ ఎన్నికలకు గెజిటెడ్ అధికారుల కొరత ఇబ్బందిగా మారనుంది. గత ఫిబ్రవరి నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పడంతో అటు గ్రామ, ఇటు జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ తర్వాత ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టతనివ్వలేదు. ప్రస్తుతం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహిస్తామని ప్రకటించింది. దీంతో జిల్లా పరిషత్ అధికారులు ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గతంలో జెడ్పీటీసీ ఎన్నికలకు ఆర్‌ఓలుగా నియమించిన గెజిటెడ్ ఆఫీసర్లు కొందరు పదవీ విరమణ పొందడంతో ఎన్నికలకు సిబ్బంది కొరత ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో ఇలా	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి
జెడ్పీటీసీలు	33	23	17
ఎంపీటీసీలు	353	235	178
పోలింగ్‌కేంద్రాలు	1,925	1,273	994
కావాల్సిన బ్యాలెట్‌బాక్స్‌లు	2,406	1,592	1,934
ప్రస్తుతం ఉన్న బాక్స్‌లు	5,876	1,842	1,650
అవసరమున్న సిబ్బంది	11,550	6,616	6,719
ప్రస్తుతం ఉన్నది	9,588	6994	5,677

వెతుకులాటలో అధికారులు..

గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం.. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతోపాటు ఎన్నికల సిబ్బందిని నియమించింది. అయితే జెడ్పీటీసీ స్థానాల ఎన్నికకు మండల ప్రత్యేక అధికారులనే రిటర్నింగ్ అధికారులుగా నియమించింది. నాలుగు ఎంపీటీసీలకు ఒక ఆర్‌ఓను గెజిటెడ్ హెడ్మాస్టర్లను ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఇతర శాఖలకు సంబంధించిన ఇంజనీర్లను, గెజిటెడ్ అధికారులను రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. వారికి ఫిబ్రవరిలోనే శిక్షణ కూడా ఇచ్చారు. ప్రస్తుతం చందంపేట, మరికొన్ని మండలాల్లో గెజిటెడ్ హెడ్మాస్టర్లు, ఎంఈఓలు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో తిరిగి గెజిటెడ్ అధికారులను నియమించేందుకు ఆ స్థాయిలో ఇన్‌చార్జ్‌లను వెతుకుతున్నారు. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎంపిక చేసిన ఆర్‌ఓ అధికారులను జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వినియోగించకపోవడం వల్ల గెజిటెడ్ అధికారుల కొరత నెలకొంది.

ఒక్క జిల్లాలోనే అవసరానికి మించి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు మొత్తం 24,888 మంది సిబ్బంది అవసరం ఉండగా ప్రస్తుతం 22,257 మంది మాత్రమే ఉన్నారు. అయితే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అవసరానికి మించి బ్యాలెట్ బాక్స్‌లు ఉన్నాయి. అలాగే ఒక్క సూర్యాపేట జిల్లాలో మాత్రమే ఎన్నికల సిబ్బంది అవసరానికి మించి ఉన్నారు.

రెండు విడతల్లో ఎన్నికలైతే.. సరిపోతారు



జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహిస్తే పోలింగ్ సిబ్బంది కొరత ఉండదు. మొదటి విడత ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బంది రెండో విడతకు కూడా కొందర్ని ఉపయోగించవచ్చు. ఎన్నికలకు సంబంధిచి ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ పూర్తయింది. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు సిద్ధంగా ఉన్నాయి.

– శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ, నల్లగొండ

జలవిద్యుత్‌పై అధికారులకు దిశానిర్దేశం



విద్యుదుత్పాదనతో దిగువకు విడుదలవుతున్న నీటిని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

- హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులను గడువులోగా పూర్తిచేయాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచన
- సాగర్ జెన్‌కో పవర్‌హౌస్‌లో అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో జెన్‌కో సీఎండీ, కలెక్టర్

నాగార్జునసాగర్: రాష్ట్రంలోని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టుల్లోని అన్ని యూనిట్లను వినియోగంలోకి తేవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నాగార్జునసాగర్ జెన్‌కో పవర్‌హౌస్‌లో.. హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు అధికారులు హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత పరిస్థితిని వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి అధికారులకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిర్దేశించిన సమయం ప్రకారం ప్రాజెక్టులను పూర్తిచేయాలన్నారు. అన్ని ప్రాజెక్టుల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని, ఇందుకొక క్యాలెండర్‌ను రూపొందించాలన్నారు. ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో దాని ప్రకారం ప్రతివారం సమీక్షించాలని చెప్పారు. సంవత్సర కాలంలోనే 2,000 మెగావాట్ల పవర్ డిమాండ్ పెరిగిందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పవర్ సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రపంచంలో వస్తున్న నూతన సాంకేతికతపై సిబ్బందికి అప్డేట్ అయ్యేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. జెన్‌కో సీఎండీ మొదలుకుని, కింది స్థాయి వరకు కొత్త టెక్నాలజీపై మూడు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గడిచిన ఏడాది కాలంలో జెన్‌కో సిబ్బంది ఒక పద్ధతి ప్రకారం పనిచేయడం వల్ల ఎలాంటి బ్రేక్ డౌన్లు, విద్యుత్ కోతలు లేవని, అందుకు ఆ శాఖలోని అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర జెన్‌కో సీఎండీ హరీష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నారాయణఅమిత్, హైడల్ డైరెక్టర్ పి.బాలరాజు, సీఈలు నారాయణ, మంగేష్‌కుమార్‌నాయక్, ఎస్ఈలు వెంకటరమణ, ఓఅండ్ఎండీ ఎస్ఈ రఘురాం, సివిల్ ఎస్ఈ డి.రామకృష్ణారెడ్డి, ఈఈ ఉపేందర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యం





మూసీ ప్రాజెక్టు నుంచి కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం
- మూసీ కుడి కాల్వకు నీటి విడుదల

కేతేపల్లి: ప్రతి ఎకరాకు సాగు నీరందించి తెలంగాణను సస్యశ్యామలం చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. వానాకాలం పంటల సాగుకు గాను శుక్రవారం ఆయన కుడి కాల్వ ఆయకట్టుకు మూసీ ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువలో ఉండడంతో వానాకాలంలో రైతులు వరినాట్లు వేసుకునేందుకు సాగుకు నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. కాల్వలకు వదిలిన నీరు వృథా కాకుండా చివరి ఆయకట్టు భూములకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు సీజన్లలో 60 వేల ఎకరాల భూములకు సాగు నీరందించే మూసీ ప్రాజెక్టు అభివృద్ధి అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మూసీ ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, కేతేపల్లి తహసీల్దార్ రమాదేవి, ఏఈలు మమత, స్వప్న, మధు, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మందడి వెంకట్రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ పి.శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్‌యాదవ్, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన అవసరం

చిట్యాల : ప్రతిఒక్కరికి సైబర్ మోసాలు, బ్యాంకు రుణాలు, ఆర్థికాంశాలపై అవగాహన అవసరమని లీడ్ బ్యాంకు స్టేట్ ఆఫీసర్ గోమతి, జిల్లా మేనేజర్ శ్రామిక్ పేర్కొన్నారు. శుక్రవారం చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జన సురక్ష, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎస్‌బీఐ ద్వారా అందిస్తున్న సురక్ష, బీమా యోజన, జీవన జ్యోతి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు అధికారులు ప్రమోద్, లింగారెడ్డి, చిట్యాల ఎస్‌బీఐ మేనేజర్ జయరాజ్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం అధికారులు డి.సైదులు, ఎం.స్వాతిక, సీఎస్‌పీ అధికారులు మల్లేష్, మాజీ సర్పంచ్ సుంకరి యాదగిరి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉరుమడ్లలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్

సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్



సదస్సులో మాట్లాడుతున్న భూమి సునీల్

కేతేపల్లి: వ్యవసాయం చేసే ప్రతి రైతు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భూచట్టాల నిపుణుడు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. లీఫ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సాగు న్యాయ యాత్రలో భాగంగా శుక్రవారం కేతేపల్లిలోని రైతు వేదికలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు భూమి, వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించటం కోసమే తాము సాగు న్యాయ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. రైతుల భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భూమి ఉండి పాసు పుస్తకం లేకపోయినా, రికార్డుల్లో వివరాలు తప్పుగా నమోదైనా, ఇతర ఏ భూసమస్య ఉన్నా ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సదస్సులో భూదాన్‌బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, ఓఎస్‌డీ శ్రీహరి వెంకటప్రసాద్, కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం, ఆర్‌ఐ వెంకన్న, ఏఈఓలు బాలరాజు, నాగరాజు, ఉమేష్, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు జీవన్, అభిలాష్, రవి, ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

28న ఏఎమ్మార్పీ నీటి విడుదల

- వానాకాలం సాగుకు షెడ్యూల్ ఖరారు
- వారబందీ పద్ధతిలోనే ఎనిమిది విడతలుగా విడుదలకు సన్నాహాలు
- ముందస్తుగా జూలైలోనే నీరివ్వడం గత ఏడేళ్లలో ఇదే తొలిసారి

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ ఆయకట్టుకు వానాకాలం సాగుకు ఈ నెల 28 నుంచి నీటి విడుదలకు నీటిపారుదల శాఖ షెడ్యూల్ ఖరారు చేసి విడుదల చేసింది. ఏఎమ్మార్పీ హైలెవల్‌లో 2.50 లక్షలు, లోలెవల్ (వరద కాల్వ)కు 50 వేల ఎకరాలకుగాను వారబందీ పద్ధతిలో 28 నుంచి నవంబర్ 24 వరకు ఎనిమిది విడతలుగా నీటిని విడుదల చేయనున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక నిర్వహణ కమిటీ (స్కీవం) సమావేశంలో చర్చించి ప్రణాళిక ఖరారు చేసి శుక్రవారం విడుదల చేశారు. గత ఏడేళ్లలో ఏఎమ్మార్పీ ఆయకట్టుకు ముందస్తుంగా జూలై నెలలోనే నీటి విడుదల ఇదే మొదటిసారి. నీటి విడుదల షెడ్యూల్ ముందే రావడంతో రైతులు ప్రణాళికబద్ధంగా వరి సాగుకు అవకాశం ఏర్పడినట్లయింది.

ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో..

ఆయకట్టులో చివరి వరకు నీరు చేరేలా కచ్చితంగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆయా డివిజన్ల ఈఈలు బాధ్యత వహించి ఎలాంటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్పందించి తక్షణమే ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు

తీరనున్న రైతుల కష్టాలు

ఆయకట్టులో నిన్నటి వరకు వర్షం లేక ఎండుతున్న పత్తి చేలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. తాగు నీటి అవసరాలకు విడుదల చేస్తున్న నీటిని ప్రధాన కాల్వ గేట్లు రాత్రి వేళ ఎత్తి డిస్ట్రిబ్యూటరీలకు మళ్లించుకుంటున్నారు. ఇప్పుడు నీటి విడుదలకు షెడ్యూల్ విడుదల చేయడంతో రైతులు పడే కష్టాలు ఇకపై తీరనున్నాయి. అయితే ఏఎమ్మార్పీ ఆయకట్టులో గుర్రంపోడు డివిజన్- 5 పరిధిలోనే అత్యధికంగా 98 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



మహిళలకు చెక్కు అందిస్తున్న డీఆర్‌డీఓ

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హాలియాలోని లక్ష్మీనర్సింహ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు వివిధ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రవణ్‌కుమార్, డీపీఎంలు రామలింగయ్య, వీరయ్య, ఏపీఎంలు కళావతి, లలిత, అశోక్‌కుమార్, లక్ష్మీనారాయణ, నరసింహ, యాదయ్య, ఆర్‌ఎం శ్రీలేఖ, సీసీ నరసింహాచారి, సైదయ్య, యాదయ్య, తంగమణి, బాలునాయక్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు గంటల పాటు నిరీక్షణ

ఈ కార్యక్రమం అధికారికంగా మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సి ఉండగా రెండు గంటలు ఆలస్యంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి రావాల్సి ఉండగా సాగర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనకు వెళ్లారు. మరోపక్క జిల్లా స్థాయి ముఖ్య అధికారులు హాజరు కాలేదు. అయితే అప్పటికే పెద్ద సంఖ్యలో ఫంక్షన్ హాల్‌లోకి వచ్చిన మహిళలు బయటకు వెళ్లకుండా కిందిస్థాయి అధికారులు గేటుకు తాళం వేశారు. దీంతో రెండు గంటల పాటు నిరీక్షించిన మహిళలు అసహనానికి గురై తాము వెళ్లిపోతామని అధికారులతో చెప్పడంతో కొందరిని బయటకు పంపారు. ఆ తరువాత జిల్లాస్థాయి అధికారులు రావడంతో కార్యక్రమం సజావుగా కొనసాగింది.

అంతటా వర్షం.. 'మెట్ట'కు జీవం

- జిల్లాలో 21.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- అత్యధికంగా మర్రిగూడలో 75.4 మి.మీ.
- అత్యల్పంగా కట్టంగూర్‌లో 3.1 మి.మీ.
- వాడుతున్న పత్తి, కంది, పెసర చేలకు ఊతం



పెద్దవూర మండల కేంద్రంలో పత్తి సాళ్లలో ఎరువు పెట్టుకుంటున్న రైతులు

నల్లగొండ అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిన కారణంగా జిల్లా వ్యాప్తంగా ముసురుతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో 21.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మర్రిగూడ మండలంలో 75.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కట్టంగూర్ మండలంలో 3.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వివిధ మండలాల్లో వాడుపడుతున్న పత్తి, కంది, పెసర పంటలకు జీవం పోసినట్లయ్యింది. ఈ వానాకాలం సీజన్‌లో 6,25,452 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,32,641 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే కంది 15 వేల ఎకరాలకు గాను 541 ఎకరాల్లో, పెసర వెయ్యి ఎకరాలకు గాను కేవలం 10 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. జిల్లాలో కొన్ని మండలాల్లో లోటు, మరికొన్ని మండలాల్లో అతిలోటు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు సరైన వర్షాలు కురవని కారణంగా జిల్లాలో చాలా మండలాల్లో సాగుచేసిన మెట్టపంటలైన పత్తి, కంది, పెసర చేలు వాడుబట్టి చనిపోయే స్థితిలో జిల్లా అంతటా ముసురుతో కూడిన మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు పెట్టుకునేందుకు సిద్ధం

గురువారం మోస్తరు వర్షం కురవడంవతో రైతులు పత్తి, కంది చేలకు ఎరువులు పెట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికు గుంటుకలు తోలుకుని, డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులను సిద్ధంగా ఉంచుకున్న రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే వర్షం కురవడంతో చేలకు ఎరువులు పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

నత్తనడకన వరినాట్లు

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఇప్పటి వరకు సరైన వర్షం కురవలేదు. దీనికితోడు నాగార్జునసాగర్ ఆయకట్టుకు సాగునీటి విడుదల లేని కారణంగా వరినాట్లు నత్తనడకన సాగుతున్నాయి. కేవలం నాన్ ఆయకట్టు ప్రాంతంలో మాత్రమే రైతులు ఇప్పటి వరకు కేవలం 34,284 ఎకరాల్లో వరినాట్లు వేసుకున్నారు. గత వానాకాలం సీజన్‌లో జూలై రెండో వారం వరకు 43,260 ఎకరాల్లో వరినాట్లు వేసుకున్నారు. అంటే గత ఏడాది కంటే ఈ ఏడాది 10 వేల ఎకరాలు తక్కువ వరినాట్లు వేశారు. నాన్‌ఆయకట్టులో పెద్దగా నాట్లు పడలేదు. ఆయకట్టులో కొన్నిచోట్ల వరినాట్లు పోసుకుని సిద్ధంగా ఉన్నారు. సాగర్ ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేస్తేనే ఆయకట్టులో వరినాట్లు ఊపందుకోనున్నాయి.

వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో..)					
మండలం	వర్షపాతం	శాలిగౌరారం	23.7	మాడుగుపల్లి	11.0
		నకిరేకల్	22.2	వేములపల్లి	28.9
		కేతేపల్లి	4.3	దామరచర్ల	21.5
మర్రిగూడ	75.4	తిప్పర్తి	8.3	అడవిదేవులపల్లి	3.3
గుండ్లపల్లి	44.6	నల్లగొండ	19.7	పెద్దవూర	26.7
తిరుమలగిరిసాగర్	43.1	కనగల్	15.2	పీఏపల్లి	17.8
చింతపల్లి	41.6	మునుగోడు	24.0	నేరెడుగొమ్ము	6.0
మిర్యాలగూడ	34	చండూరు	8.8	కొండమల్లేపల్లి	22.0
నిడమనూరు	33.8	నాంపల్లి	4.4	దేవరకొండ	21.5
చిట్యాల	4.9	గుర్రంపోడు	17.3	చందంపేట	3.5
నార్కట్‌పల్లి	3.9	అనుముల హాలియా	26.1	గట్టుప్పల్	28.3
కట్టంగూర్	3.1	త్రిపురారం	26.3	గుడిపల్లి	21.5



పెద్దవూరలో పత్తి గింజలు నాటుతున్న మహిళా కూలీలు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

కనగల్: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన కనగల్ మండల పరిధిలోని ఇరుగంటిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరుగంటిపల్లి గ్రామానికి చెందిన రైతు బొప్పిడి సత్తిరెడ్డి(79) శుక్రవారం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేస్తుండగా.. విద్యుత్ సర్వీస్ వైరు అతడికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం వద్దకు వెళ్లిన సత్తిరెడ్డి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు జాన్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లి చూడగా.. అప్పటికే సత్తిరెడ్డి మృతిచెంది ఉండటం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి కుమారుడు జాన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలస కార్మికుడు..

చిట్యాల: చిట్యాల మండలం ఏపూరు గ్రామంలోని ఓ పరిశ్రమలో పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికుడు విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. వేరే రాష్ట్రానికి చెందిన సుజిత్ కొంతకాలంగా ఏపూరు గ్రామంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పరిశ్రమలో అతడు పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తోటి కార్మికులు వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.


చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

- బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

నెక్కొండ: తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 26న నెక్కొండ మండల కేంద్రానికి చెందిన బండారి కొమురయ్య ఇంట్లో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఈ కేసును సీపీ.. సీసీఎస్ పోలీసులకు అప్పగించారని పేర్కొన్నారు. పలు దొంగతనాల్లో నేరస్తుడైన ఆటో డ్రైవర్ బిర్రు రమేశ్‌బాబు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో నివాసముంటున్నాడు. శుక్రవారం నెక్కొండ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో రమేశ్‌బాబును అదుపులోకి తీసుకుని విచారించగా.. బండారి కొమురయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడినట్లు తేలిందన్నారు. గతంలో జనగామ, నల్లగొండ టూటౌన్, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలు చేశాడని ఆయన వివరించారు. నిందితుడి నుంచి నెక్కొండలో చోరీ చేసిన 2 తులాల బంగారం, 33 తులాల వెండి, జనగామలో చోరీ చేసిన 6.6 తులాల బంగారం, 65 తులాల వెండి ఆభరణాలను రికవరీ చేశామని ఏసీపీ చెప్పారు. రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందించామన్నారు. దర్యాప్తునకు సహకరించిన వరంగల్ క్రైం ఏసీపీ సదయ్య, వరంగల్ సీసీఎస్ సీఐ బాలాజీ వరప్రసాద్, ఎస్సై ప్రమోద్, నెక్కొండ ఎస్సై మహేందర్ తోపాటు సిబ్బందిని అభినందించారు. సమావేశంలో నెక్కొండ సీఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో 'దోస్త్' కుదరడం లేదు!

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 25శాతం కూడా భర్తీ కాని సీట్లు
- మూడు విడుతలు కౌన్సిలింగ్ నిర్వహించినా అంతంతమాత్రంగానే ఆదరణ
- ఇంజనీరింగ్, వృత్తి విద్యా కోర్సుల వైపు మొగ్గు చూపుతున్న విద్యార్థులు



భువనగిరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కళాశాల్లో ఫస్టియర్‌లో ప్రవేశాలకు సంబంధించి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) నోటిఫికేషన్ మే నెల 3వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. అదే నెల 10వ తేదీ నుంచి విద్యార్థులకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మూడు విడుతల్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు జూన్ 25వ తేదీన మూడో విడత సీట్ల కేటాయింపుతో ఈ ప్రక్రియ ముగిసింది. ఈ మూడు విడుతలు ముగిసే నాటికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో కనీసం 25శాతం కూడా సీట్లు భర్తీకాలేదు.

ఉమ్మడి జిల్లాలో ఏడు ప్రభుత్వ కళాశాలలు..

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు ప్రభుత్వ, నాలుగు అటానమస్ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటితో పాటు ఎయిడెడ్, బీసీ సంక్షేమ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలున్నాయి. ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాలు కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మాత్రం 15 నుంచి 25 శాతం వరకు మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయి. ఇటీవల ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ పూర్తయ్యింది. ఇంజనీరింగ్‌లో సీట్లు రాని వారు డిగ్రీలో చేరేందుకు వీలుగా నాలుగో విడత దోస్త్ కౌన్సిలింగ్ నిర్వహించే అవకాశం లేకపోలేదు. అయినప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి చూపడం లేదు.

వృత్తి విద్యా కోర్సుల వైపు మొగ్గు..

విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎక్కువగా వృత్తి విద్యా కోర్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. కొంత మంది బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల్లో వసతి సౌకర్యాలు ఉండటంతో వాటిలో ప్రవేశాల పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కొత్త కోర్సులకు అనుమతి తీసుకోవడంతో ఆయా కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు చేరుతున్నారు. జీవితంలో తొందరగా స్థిరపడాలనే ఆలోచనతో ఉన్న విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, బీ ఫార్మసీ, అగ్రికల్చర్ వంటి కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో భర్తీ అయిన సీట్ల వివరాలు

ప్రభుత్వ కళాశాల	మొత్తం సీట్లు	ఇప్పటివరకు భర్తీ అయిన సీట్లు
ఆలేరు	360	58
చండూరు	180	37
హాలియా	480	64
హుజూర్‌నగర్	360	65
నకిరేకల్	300	44
రామన్నపేట	360	85
మిర్యాలగూడ	420	88

అన్నీ ఉన్నా విద్యార్థులు లేక..

విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రస్తుతం ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు కొత్త కోర్సులను అనుమతి తీసుకుని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. కొత్త కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాలు కొంత మెరుగ్గానే ఉన్నాయి. దీనికి తోడు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విస్తృతంగా ప్రచారం చేసి ప్రవేశాల సంఖ్యను పెంచుకుంటున్నాయి. కానీ విశాలమైన భవనాలు, సకల సౌకర్యాలు, అధ్యాపకులు ఉన్నప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సగం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. ఇటీవల నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం స్పష్టతనివ్వాలి

- ప్రజా సమస్యలపై ఆగస్టు నుంచి పోరుబాట
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


మాట్లాడుతున్న జాన్‌వెస్లీ, చిత్రంలో పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి తదితరులు

నల్లగొండటౌన్: ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టతనివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి.. ఢిల్లీలో కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడితో చర్చలు జరిపారని, కొన్ని నిర్ణయాలు కూడా జరిగాయని ఏపీ ఇరిగేషన్ మంత్రి ప్రకటించారని తెలిపారు. ఈ నేపథ్యంలో అసలు చర్చలు జరిగాయా లేదా అన్న దానిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై చర్చలు జరిగిఉంటే రాష్ట్రానికి వరద, మిగులు జలాలపై స్పష్టమైన వాటాలను తేల్చాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల మధ్య వివాదాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తోందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిన విధంగా వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. జగిత్యాల జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్న మల్లేష్ అనే యువకున్ని యువతి బంధువులు హత్య చేయడం దారుణమని, ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం వెంటనే కులాంతర వివాహ చట్టం తేవాలన్నారు. ప్రజా సమస్యలపై ఆగస్టు, సెప్టెంబర్ నెలలో ఉద్యమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ వద్ద రోడ్డు ప్రమాదం

- మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్యకు తీవ్రగాయాలు


గాయపడిన మాజీ ఎమ్మెల్యే పుల్లయ్య

నకిరేకల్: నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన మహబూబాబాద్ నుంచి హైదరాబాద్‌కు తన కారులో వెళ్తుండగా.. మార్గమధ్యలో నకిరేకల్ మండలం చందంపల్లి శివారులోని 365వ నంబర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. వర్షం కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో గాయపడిన మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్యను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపారు.

భువనగిరిలో మూడిళ్లలో చోరీ

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున హౌసింగ్‌బోర్డ్ కాలనీలో నివాసముంటున్న మన్నె వెంకట్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మొదట సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. అనంతరం ఇంటి తాళం పగులగొట్టి రూ.40 వేల నగదు, 250 గ్రాముల వెండి, పావు తులం బంగారం అపహరించారు. అదేవిధంగా భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకన్న ఇంట్లో కిరాయికి ఉంటున్న మోటకొండూరు ఎంపీడీఓ ఇందిర ఇంట్లోకి చొరబడి 5 తులాల బంగారం, రూ.40 వేల నగదు దోచుకొని వెళ్లారు. పక్కనే ఉన్న మరో ఇంట్లోకి వెళ్లి చూడగా ఏమీ దొరక్కపోవడంతో తిరిగి వెళ్లారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల మేరకు ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భువనగిరి పట్టణంలో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

పాలకవీడు: చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన పాలకవీడు మండలం కోమటికుంట గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోమటికుంట గ్రామానికి చెందిన రాతికింది చినలింగయ్య(52) గురువారం సాయంత్రం తన భార్యతో కలిసి గ్రామ పరిధిలోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ఎయిర్ ట్యూబ్ సహాయంతో చెరువులోకి దిగి చేపలు పడుతున్నాడు. ఆలస్యం కావడంతో చినలింగయ్య భార్య ఇంటికి వెళ్లి పోయింది. ఈ క్రమంలో వచ్చిన ఈదురు గాలులకు ట్యూబ్ నుంచి చినలింగయ్య అదుపుతప్పి నీటిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కోదాడ నుంచి రెస్క్యూ టీంను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు కూడా లింగయ్య ఆచూకీ లభించలేదు. కొంతకాలం క్రితమే చినలింగయ్య పక్షవాతానికి గురయ్యాడని, నీటిలో ఈదడం కష్టంగా మారి చెరువులో మునిగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బుద్ధవనాన్ని సందర్శించిన ఉపముఖ్యమంత్రి


బుద్ధవనంలో బుద్ధ జ్యోతి వెలిగిస్తున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క


ధ్యానం చేస్తున్న మల్లు భట్టివిక్రమార్క

నాగార్జునసాగర్: సాగర్‌లోని బుద్ధవనాన్ని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం సందర్శించారు. బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బుద్ధవనం విశేషాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని మహాస్థూపం ధ్యానమందిరంలో ఆయన బుద్ధ జ్యోతిని వెలిగించి కాసేపు ధ్యానం చేశారు. బుద్ధవనం ప్రాజెక్టు విశేషాలతో కూడిన వీడియో చిత్రాన్ని ఉపముఖ్యమంత్రి తిలకించారు. ఆయన వెంట రాష్ట్ర జెన్‌కో సీఎండీ హరీష్, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తదితరులు ఉన్నారు.

భువనగిరిలో పర్యటించిన పశ్చిమ బెంగాల్ అధికారులు

- ప్రజా పంపిణీ వ్యవస్థపై అధ్యయనం


పశ్చిమ బెంగాల్ అధికారులను సన్మానిస్తున్న రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు

సాక్షి,యాదాద్రి: రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థపై అధ్యయనం చేయడానికి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖకు చెందిన ఉన్నత స్థాయి అధికారుల బృందం మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చారు. ఈ బృందంలో ప్రత్యేక కార్యదర్శి ప్రణబ్ బిస్వాస్, సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ సుప్రతిమ్ లోధ్, సంయుక్త డైరెక్టర్లు సునయ్ కుమార్ గోస్వామి, దేబమాల్య బసు ఉన్నారు. వారు తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వహణ, ధాన్యం సేకరణలో రాష్ట్రం అమలు చేస్తున్న విధానం, వాహన లొకేషన్ ట్రాకింగ్ అమలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని వినోద్ ట్రేడర్స్ మిల్లును సందర్శించి మిల్లింగ్ జరుగుతున్న తీరును, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్‌లో ధాన్యం నమోదు, బియ్యం సేకరణ వంటి అంశాలను పరిశీలించారు. వారి వెంట జిల్లా మేనేజర్ డి. హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం. రోజారాణి, రైస్ మిల్లు యజమానులు తదితరులు ఉన్నారు.

పద్మావతి అమ్మవారికి వైభవంగా కుంకుమార్చన


కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పద్మావతి అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో అర్చకులు వైభవంగా కుంకుమార్చన నిర్వహించారు. అంతేకాకుండా ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి ఆలయ మాడ వీధుల్లో తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఆయా పూజల్లో ఆలయ అర్చకులు, భక్తులు తదితరుపాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

- 10 మంది అరెస్ట్.. ముగ్గురు పరారీ
- 3 కేజీల గంజాయి, 10 సెల్‌ఫోన్లు, రూ.9500 నగదు స్వాధీనం


నకిరేకల్: నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్: అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు నకిరేకల్ పోలీసులు. ఈ ముఠాలో పది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రంలోని కలహండి జిల్లా కోకసర్ తాలుకా దుంపార గ్రామానికి చెందిన కిశోర్ టాండస్ కొంతకాలంగా నకిరేకల్‌లో నివాసముంటూ విజయవాడ–హైదరాబాద్ హైవే వెంట ఉన్న నారాయణస్వామి డెయిరీ ఫామ్ యాజమాని వద్ద కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కిశోర్ టాండస్ సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఒరిస్సాలోని తన సొంత గ్రామానికి చెందిన బోలానాథ్ దగ్గర తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి నకిరేకల్‌కు తీసుకొచ్చి.. నకిరేకల్ పట్టణంలోని రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన అర్జున్ కుమార్‌దాస్, మిల్కా కుమార్, షేక్ అబ్బు, బికాస్, వికాస్‌ను పరిచయం చేసుకుని వారికి ఒక్కొక్కరికి 500 గ్రాముల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన వారు నకిరేకల్‌లోని చీమలగడ్డకు చెందిన విద్యార్థి యమడాల క్రాంతికుమార్, రహమత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ లక్కపాక సంతోష్, లిఫ్ట్ ఆపరేటర్ యాదుళ్ల అఖిల్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్ షేక్ సియామ్, నకిరేకల్ మండల కడపర్తి గ్రామానికి చెందిన ఎక్స్‌రే టెక్నీషియన్ గుండె శ్రీకాంత్, బిహార్ రాష్ట్రంలోని పాట్నా జిల్లా దూదాల తాలుకాలోని హల్దీచాప్రా గ్రామానికి చెందిన నాగేందర్‌కుమార్‌తో పాటు మరికొందరికి 50 గ్రాముల చొప్పున విక్రయించారు. గురువారం సాయంత్రం నకిరేకల్ పట్టణ శివారులోని సాయిప్రియ హోటల్ వెనుక గడ్డివాముల పక్కన ఉన్న ఓ ఇంట్లో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి కిశోర్ టాండస్‌ను పట్టుకున్నారు. అతడిని విచారించగా.. మిగతా వారి పేర్లు చెప్పడంతో బిహార్ రాష్ట్రానికి చెందిన అర్జున్‌కుమార్, మిల్కా కుమార్, షేక్ అబ్బు, నాగేందర్‌కుమార్‌తో పాటు నకిరేకల్‌కు చెందిన యమడాల క్రాంతికుమార్, లక్కపాక సంతోష్, యాదుళ్ల అఖిల్‌రెడ్డి, షేక్ సియామ్, కడపర్తి గ్రామానికి చెందిన గుండె శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బోలానాథ్, బిహార్ రాష్టానికి చెందిన బికాస్, వికాస్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అరెస్టయిన వారి నుంచి మూడు కేజీల గంజాయి, 10 సెల్‌ఫోన్లు, రూ.9500 నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో నకిరేకల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ లచ్చిరెడ్డి, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఒరిస్సా నుంచి అక్రమంగా గంజాయి తీసుకువచ్చి తిరుమలగిరి(సాగర్)మండల పరిధిలో విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చండూరు మండలం కోటయ్యగూడేనికి చెందిన శివరాత్రి దుర్గాప్రసాద్, రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌కు చెందిన వరికుప్పల దిలీప్‌కుమార్, వరికుప్పల ప్రశాంత్ ఒరిస్సా రాష్ట్రంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు ముగ్గురు కొంతకాలంగా ఒరిస్సా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయిని రాష్ట్రానికి తీసుకొచ్చి ఇక్కడి యువతకు విక్రయిస్తున్నారు. గురువారం తిరుమలగిరి(సాగర్) మండలం చిల్కాపురం గ్రామానికి చెందిన తుడుం ధనుంజయ్ అనే వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా.. నమ్మదగిన సమాచారం మేరకు తిరుమలగిరి గ్రామ శివారులో వీరి ముగ్గురిని పట్టుకున్నారు. ధనుంజయ్ పరారయ్యాడు. వారి నుంచి 96 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక బాంగ్ బాటిల్ స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. తిరుమలగిరి(సాగర్) మండలంలో గంజాయి సేవించే పది మంది వ్యక్తులను గుర్తించామని, వారిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపించనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి అమ్మినా, సేవించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

వరిలో జింక్ లోపం.. నివారణ చర్యలు


పాడిపంట



గుర్రంపోడు: పంటల సాగులో సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గిపోతుండటంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రసాయన ఎరువుల్లో ముఖ్య పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఉండటం, సూక్ష్మపోషకాలు లేకపోవడం వలన దీర్ఘకాలికంగా రసాయన ఎరువుల మీద ఆధారపడి సాగు చేసే నేలల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఏర్పడతాయి. తక్కువ పరిమాణంలో అవసరమయ్యే జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర పోషకాలు పైరు ఎదుగుదలకు, మంచి దిగుబడులకు దోహదపడతాయి. వరి మాగాణుల్లో జింక్ లోపం నివారణకు గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి అందిస్తున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

వరిలో జింక్ లోపానికి కారణాలు

వరిలో జింకు లోపం అధికంగా రావడానికి ముఖ్య కారణం సేంద్రియ ఎరువుల వినియోగం తక్కువగా ఉండటం. వరి సాగుకు ముందు పెసర, అలసంద, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి నేలలో కలియ దున్నుతున్నారు. ఇది మినహా సేంద్రియ ఎరువుల వినియోగం వరిలో అత్యధిక విస్తీర్ణంలో ఉండటం లేదు. వరిలో జింక్ లోపం ఏర్పడటానికి మరో ముఖ్య కారణం వరిసాగు చేసే నేలల్లో చౌడు ఉండటం. చౌడు వలన నేలల్లో ఉన్న జింకు మొక్కలకు సులభంగా అందుబాటులోకి రాక పైరులో జింకు లోపం ఏర్పడుతుంది. ఈ కారణాలే కాక రసాయనిక ఎరువులు సమతులంగా వాడనప్పుడు, మురుగు నీరు సరిగా బయటకు వెళ్లని నేలల్లో వరి సాగు చేసినప్పుడు, వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గినప్పుడు కూడా వరిలో జింకు లోపం కనిపిస్తుంది.

దిగుబడులపై ప్రభావం

జింకు లోపం ఉంటే ఏ పంటలోనైనా రసాయన ఎరువులను తీసుకునే శక్తి తగ్గిపోయి వేసిన ఎరువులు వృథా అవుతాయి. వరిలో వచ్చే జింకు లోపం పంట పెరుగుదల, దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. జింకు లోపం ఉన్నప్పుడు నాటిన పైరు అనారోగ్యంగా కనిపిస్తుంది. పిలకలు ఆలస్యంగా వస్తాయి. అంతేగాక వచ్చిన పిలకలు సరిగా పెరగక పైరు కృశించినట్లు, గిడసబారి కనిపిస్తుంది. లేత ఆకులు ఈనెల మధ్య భాగం పసుపు రంగులోకి మారిపోయి పైరు కళ తప్పి కనిపిస్తుంది. జింకు లోపం తీవ్రత అధికంగా ఉన్న చోట్ల అడుగు ఆకులు ఎండిపోతాయి. ఈ విధంగా పైరు పెరుగుదలకు ఇబ్బంది కలిగి దిగుబడులు తగ్గుతాయి. జింకు ధాతు లోపం ప్రతి ఏటా పెరుగుతూ వస్తుంది. కాలక్రమేణా పంటల పోషకాల యాజమాన్యంలో వచ్చిన మార్పులు దీనికి కారణం. వరి సాగులో దిగుబడులు తగ్గకుండా ఉండటానికి సరైన జింకు పోషక యాజమాన్యాన్ని ఆచరించాలి.

నివారణ చర్యలు

జింకు లోపం నివారణకు అన్నింటికంటే మొదట చేయాల్సింది పంటకు అవసరమైన పోషకాల్లో కనీసం 30 శాతం సేంద్రియ ఎరువుల ద్వారా అందించాలి. పశువుల ఎరువును తప్పనిసరిగా తోలించడం, ఇతర జీవన ఎరువులను వాడటం చేయాలి. సేంద్రియ ఎరువులు వినియోగించడానికి వీలు కానప్పుడు వరి నాటడానికి ముందు ఎకరాకు 20 కిలోల వంతున జింకు సల్ఫేట్ దమ్ములో వేసి పైరులో జింకు లోపం ఏర్పడకుండా నివారించుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ జింకు సల్ఫేట్ దమ్ములో వేసినప్పుడు భాస్వరపు ఎరువులతో కలిపి వేయరాదు. జింకు సల్ఫేట్ వేయడానికి ముందు, తర్వాత రసాయన ఎరువులు వేయడానికి నాలుగు రోజల విరామం ఉండాలి. జింకు సల్ఫేట్‌ను ఖరీఫ్, రబీ పంటలకు కలిపి ఒకసారి వేస్తే సరిపోతుంది.

నాటు వేసిన తర్వాత..

దమ్ములో జింకు సల్ఫేట్ వేయని పొలాల్లో పైరుపై జింకు సల్ఫేట్ పిచికారీ చేసి కూడా జింకు లోపాన్ని నివారించుకోవచ్చు. వరి నాటిన 20 రోజులకు ఒకసారి, మళ్లీ వారం వ్యవధిలో మరోసారి ఎకరానికి 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలి. పదిహేను రోజుల వ్యవధిలో మరోదఫా ఇదే మోతాదును పిచికారీ చేసుకోవాలి. జింకు సల్ఫేట్‌ను వరి పొలంలో పిచికారీ చేసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పురుగు మందలు లేదా తెగుళ్ల మందులతో కలిపి పిచికారీ చేయకూడదు. చౌడు నేలల్లో జింకు సల్ఫేట్‌ను దమ్ములో వేయడం కంటే రెండు దఫాలుగా పిచికారీ చేసుకోవడం లాభదాయకం.